క్లుప్తంగా

సీపీఆర్ చేయడం నేర్చుకోవాలి

కుంటాల: జీవనశైలిలో మార్పుల కారణంగా గుండెపోటు బారిన పడే వారి సంఖ్య పెరుగుతుందని.. ప్రతి ఒక్కరూ సీపీఆర్ చేయడం నేర్చుకోవాలని ఇన్‌చార్జి హెచ్‌ఎం రతన్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం భైంసా గురుకృప ఒకేషనల్ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ సాయినాథ్, ఉపాధ్యాయులు గణేశ్, సగ్గం గంగాధర్, భోజన్న, శ్రీనివాస్, సాహెబ్‌రావు, మారుతి, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

శిశుమందిర్‌లో గీతాజయంతి

భైంసాటౌన్: పట్టణంలోని గుజిరిగల్లి, కిసాన్ గల్లి, సుభద్రవాటిక శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలల్లో శుక్రవారం గీతాజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కృష్ణార్జున వేషధారణలో అలరించారు. ఉపాధ్యాయులు గీతాపఠన ప్రాముఖ్యతను వివరించారు. ప్రధానోపాధ్యాయులు గంగాధర్ తదితరులున్నారు.

శుద్ధ జలయంత్రం అందజేత



ఎన్ఆర్ఐ, వారి తల్లిదండ్రులతో సిబ్బంది

భైంసారూరల్: మండలంలోని వాలేగాం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ఉదయ్‌రెడ్డి శుక్రవారం రూ.25 వేల విలువైన శుద్ధ జలయంత్రాన్ని విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐతోపాటు వారి తల్లిదండ్రులు లక్ష్మీదేవారెడ్డిని ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు సంజయ్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పంటల సందర్శనలో విద్యార్థులు



కొత్తిమీర సాగు పరిశీలిస్తున్న విద్యార్థులు

సోన్: మండలంలోని జాఫ్రపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామంలోని వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. మిరప, పసుపు, ఉల్లి, కొత్తిమీర, అరటితోటలను పరిశీలించారు. వారికి రైతులు, ఉపాధ్యాయులు దిగుబడి, మద్దతు ధర, మార్కెటింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు పరమేశ్వర్, ఉపాధ్యాయులు నగేశ్‌కుమార్, ముత్తన్న, అనిత, విజయమాల, సైఫ్ అలీ, విజయలక్ష్మి ఉన్నారు.

కరెంట్ షాక్‌తో మేక మృతి

నర్సాపూర్(జి): మండలంలోని తిమ్మాపూర్(జి)లో మాటేగాం వినోద్‌రెడ్డికి చెందిన మేక శుక్రవారం గ్రామ శివారులో మేతకు వెళ్లి విద్యుత్ నియంత్రికకు తగిలి మృతి చెందింది. మేక విలువ రూ.20 వేలు ఉంటుందని ప్రభుత్వం పరిహారమివ్వాలని బాధితుడు కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో నారాయణ్‌రావు

భైంసాటౌన్: నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ నాయకులు, మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ్‌రావుపటేల్ అన్నారు. శుక్రవారం తానూరు మండలానికి చెందిన పలువురు భైంసాలోని తన నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా వారికి కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కె.సుదర్శన్‌రెడ్డి, క్షీర్‌సాగర్, వాగ్మరే నగేష్, గజ్భారే కెర్బ, దేవిదాస్, సోలాపూర్, జాదవ్ బాలాజీ పాటిల్ ఉన్నారు. శంకర్ చంద్రే, సదాశివపాటిల్ తదితరులు ఉన్నారు.

పన్నులు వసూలు చేయండి

భైంసారూరల్: పంచాయతీలకు ఆదాయం సమకూరేందుకు గ్రామాల్లో ఇంటి పన్నులను పక్కాగా వసూలు చేయాలని డీఎల్‌పీవో శివకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని లింగాలో నర్సరీని డీఎల్‌పీఓ పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని కూలీలకు సూచించారు. అనంతరం గ్రామంలో పర్యటించి పంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. మురికి కాలువలను శుభ్రం చేయాలన్నారు. సర్పంచ్ గణేశ్, ఎంపీవో మోజంహుస్సేన్, కార్యదర్శి శ్రీలత తదితరులు ఉన్నారు.

బోరిగాంలో పర్యటన

సారంగాపూర్: మండలంలోని బోరిగాంలో శుక్రవారం మండల ప్రత్యేకాధికారి గంగాధరయ్య పర్యటించారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లి పంట వివరాలు తెలుసుకున్నారు. అనంతరం క్రీడామైదానం, పల్లె ప్రకృతివనం, వైకుంఠధామం, అంగన్‌వాడీ కేంద్రం పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. వారి వెంట ఎంపీడీఓ సరోజ, పంచాయతీ కార్యదర్శి ప్రవంతి, టీఏ రోజా, ఎఫ్ఏ సాయేందర్, తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో గణిత దినోత్సవం

- విద్యార్థులకు క్విజ్ పోటీలు
- బహుమతులు ప్రదానం చేసిన ఉపాధ్యాయులు
- రామానుజన్‌కు ఘన నివాళి



సోన్ ఉన్నత పాఠశాలలో బహుమతులు పొందిన విద్యార్థులు

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో గణిత దినోత్సవం నిర్వహించారు. స్థానిక శ్రీ గౌతమిహైస్కూల్, శ్రీసరస్వతి శిశుమందిర్ గుజిరిగల్లీ పాఠశాలల్లో రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులతో వివిధ ప్రదర్శనలు చేయించారు.

ముధోల్: మండలకేంద్రంలోని రబీంద్ర, అక్షర, లిటిల్‌ఫ్లవర్, సరస్వతీ శిశుమందిర్ పాఠశాలల్లో గణిత దినోత్సవం నిర్వహించారు. శ్రీనివాసరామనుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు గణితంపై పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు కిషన్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్, లక్ష్మణచాంద, పార్‌పెల్లి, మల్లాపూర్, చామన్‌పెల్లి ఉన్నత పాఠశాలలతోపాటు కేజీబీవీలో గణిత దినోత్సవం నిర్వహించారు. గణితం అంటే విద్యార్థులు భయం వీడి ఆసక్తి పెంచుకోవాలని ప్రధానోపాధ్యాయులు సూచించారు. ప్రధానోపాధ్యాయులు అశోక్‌వర్మ, మోహన్, కేజీబీవీ ఎస్‌వో నవిత, గణిత ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని బెల్‌తరోడా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గణితంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఉపాధ్యాయులు పవన్‌కుమార్, గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

కడెం: మండలంలోని మారుమూల గ్రామమైన అల్లంపల్లి జీయర్ గురుకుల పాఠశాలలో గణిత దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు గీసిన గణిత మేధావుల చిత్రాలు ఆకట్టుకున్నాయి.

అల్ఫోర్స్‌లో గణితోత్సవ్

నిర్మల్‌టౌన్: శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో శుక్రవారం ×గణితోత్సవ్Ø వేడుకలు నిర్వహించారు. దీనికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి హాజరై రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు గణితంపై ఆసక్తి కల్గించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు సూచించారు. ప్రాథమిక అంశాలపై పట్టు సాధించి సాధన చేస్తే గణితంలో అద్భుతాలు సృష్టిస్తారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన 100 గణిత నమూనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిర్మల్‌టౌన్ : అల్ఫోర్స్‌లో తమ ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



నిర్మల్‌లోని జుమ్మెరాత్‌పేట్ పాఠశాలలో..

నిర్మల్‌రూరల్: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శ్రీనివాస రామానుజన్ జయంతి నిర్వహించారు. నిర్మల్‌లోని మంజులాపూర్ ఉన్నత పాఠశాల, జుమ్మెరాత్‌పేట్ ఉన్నత పాఠశాల, కస్బా ఉన్నత పాఠశాల, వశిష్ట ఉన్నత పాఠశాల, కేజీబీవీ, అభ్యాస పాఠశాలల్లో విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో గణిత మాడ్యూల్స్ చార్టులను ప్రదర్శించారు.

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీఎస్‌ఎస్‌లో హెచ్‌ఎం నరేందర్, గణిత ఉపాధ్యాయుడు జాడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన సిద్ధార్థ, స్నిగ్ధ, వర్షిత, మల్లికార్జున్, యశ్వంత్, రూపలకు బహుమతులను ప్రదానం చేశారు. మస్కాపూర్ గ్రామంలోని విజేత పాఠశాలలో డైరెక్టర్ మదిరె శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు.

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని కేజీబీవీతో పాటు సిర్గాపూర్ ప్లేర్ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవం నిర్వహించారు. గణిత ఉపాధ్యాయులు నదీం, సుఖేశ్‌రెడ్డితోపాటు గంగారెడ్డి, భోజారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోన్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి ఆధ్వర్యంలో విద్యార్థులకు గణితంపై ఉపన్యాసం, డ్రాయింగ్, క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

భైంసారూరల్: మండలంలోని మిర్జాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం గణిత దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు గణితంపై క్విజ్‌పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లికార్జున్, దశరథ్, సత్యనారాయణ, కృష్ణారావు, శ్రీనివాస్, అరుణ, గజేందర్, సతీశ్ ఉన్నారు.

కుంటాల: మండల కేంద్రంలోని శాంతినికేతన్ పాఠశాలలో రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కుంటాల ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు సాహెబ్‌రావును తోటి సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో సంతోష్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నర్సాపూర్(జి)లో నివాళులర్పిస్తున్న సిబ్బంది



ఖానాపూర్: మస్కాపూర్ జెడ్పీఎస్ఎస్‌లో..



నిర్మల్‌రూరల్: వశిష్ట పాఠశాలలో..



లక్ష్మణచాంద: వడ్యాల్‌లో



భైంసాలోని గుజిరిగల్లి పాఠశాలలో..



కడెం: అల్లంపల్లిలో విద్యార్థులు గీసిన చిత్రాలు

తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి

నిర్మల్‌టౌన్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని నిర్మల్ పట్టణ ట్రాఫిక్ ఎస్సై దేవేందర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పట్టణ సీఐ పురుషోత్తం ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సరైన ధ్రువపత్రాలు లేని 55 వాహనాలను, ఐదు మాడిఫై సైలెన్సర్లు బిగించిన బైక్‌లను స్వాధీనం చే సుకున్నారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో కొందరు ట్రాఫిక్ చలాన్లు తప్పించుకునేందుకు నంబర్ ప్లేట్లు విరగ్గొడితే తప్పుగా రాసిన ఫోర్జరీ, చీటింగ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలువురికి స్లాట్ బుక్ చేయించి లైసెన్స్‌కు దరఖాస్తు చేయించారు. ఇందులో ట్రాఫిక్ సిబ్బంది ఉన్నారు.

వాహనాలు తనిఖీ

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తి గ్రామంలోని చెక్‌పోస్టు వద్ద శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులు అన్ని పత్రాలను వెంట ఉంచుకోవడంతో పెండింగ్ చలాన్లు చెల్లించాలని సూచించారు.

గ్రామసభ

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో శుక్రవారం ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. పనుల గుర్తింపు, ప్రణాళికల తయారీపై చర్చించారు. సమావేశంలో సర్పంచ్ కనీస్ ఫాతిమా, కార్యదర్శి యోగేష్, ఎఫ్ఏ వాణి పాల్గొన్నారు.

మీసేవ నిర్వాహకుడిపై ఫిర్యాదు

పెంబి: ధ్రువీకరణ పత్రాలకు అధికంగా డబ్బులు వసూలు చేస్తున్న పెంబిలోని మీసేవ కేంద్రం నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని మండలంలోని తాటిగూడకు చెందిన తేజవత్ మహేందర్ శుక్రవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వారి వెంట రవీందర్ తదితరులు ఉన్నారు.

'బస్సులు నడిపించాలి'

కుంటాల: కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో బస్సులు సరిపోక మహిళలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ సోషల్ మీడియా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంటవార్ దశరథ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కల్లూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మరిన్ని బస్సులు నడిపి మహిళల ఇబ్బందులు తొలగించాలని ఆయన కోరారు.

కేంద్ర పథకాలపై అవగాహన

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్‌లో శుక్రవారం టీజీబీ అసిస్టెంట్ సోమశేఖర్, ఇండేన్ గ్యాస్ మేనేజర్ లోకిని జాని కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ గోపాల్, ఏఎన్ఎం చంద్రకళ, రాజు, వెంకటేశ్ ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



న్యూముజ్గిలో పూజలు చేస్తున్న ఐకేరెడ్డి, భక్తులు

నిర్మల్‌రూరల్: మండలంలోని న్యూముజ్గి గ్రామంలో కల్యాణ రాముడి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యే మహేశ్వర్ డ్డి సతీమణి కవిత, బీజేపీ జిల్లా అధ్యక్షులు అంజుకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొని పూజలు చేశారు. సర్పంచ్ రాజమణి, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారి ప్రతిష్ఠాపన

నిర్మల్‌వైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని పింజారిగుట్టలో శ్రీ బంగారు మైసమ్మ అమ్మవారి పునఃప్రతిష్ఠ ఉత్సవాలు మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. శుక్రవారం కాలనీ ఆడపడుచులు ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వచ్చే ఆదివారం ఖిల్లాగుట్ట మైసమ్మకు బోనాలు సమర్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా అండాలమ్మ పల్లకి సేవ

నిర్మల్‌టౌన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అండాలమ్మ పల్లకి సేవ నిర్వహించారు. మహిళలు తరలివచ్చి సామూహిక కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. తిరుప్పావై ప్రవచనాలు వినిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ చైర్మన్ ఆమెడ శ్రీధర్, ఇన్‌చార్జి ఈవో రవి కిషన్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.



నిర్మల్‌లో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



కడెం: అంబారిపేటలో పూజలు చేస్తున్న అర్చకులు

కడెం: మండలంలోని అంబారిపేట్ గ్రామంలో శుక్రవారం సంతాన గణపతి స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. తెల్లవారుజామున నుంచి అర్చకులు కొండమాచారి ఆధ్వర్యంలో పుణ్యాహవచనం, యజ్ఞం, ప్రతిష్ఠ, పూర్ణాహుతి, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఎంపీటీసీ కట్ల సింధూజ సాగర్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పర్యటన

సోన్: విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి శంకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని జాఫ్రపూర్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, నర్సరీలను పరిశీలించారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, ఏపీవో మంజులారెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచరు, కార్యదర్శి తదితరులున్నారు. మండలంలోని గంజాల్‌లో నిర్వహించిన డ్రైడేలో ఎంపీడీవో మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

లోకేశ్వరం: నర్సరీల్లో పనులను పకడ్బందీగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి రమేశ్ అన్నారు. మండలంలోని ధర్మోరలో నర్సరీ, పల్లెప్రకృతి వనం, సెగ్రిగేషన్ షెడ్లను పరిశీలించారు. వీధులను శుభ్రం చేయాలని సూచించారు. ఎంపీడీవో సోలమాన్‌రాజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మీనా, ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్ ఉన్నారు.

పౌష్టికాహారం అందించాలి

కుంటాల: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్ల లకు పౌష్టికాహారం అందించాలని ప్రత్యేక అధికారి మసార్ రావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కల్లూర్, కుంటాలలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్లు, పాఠశాలలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీవో రహీం, కార్యదర్శులు రాజబాపు, భోజన్న తదితరులు ఉన్నారు.

నర్సరీల పరిశీలన

ముధోల్: మండలంలోని చించాల, తరోడా గ్రామాల్లోని నర్సరీలను శుక్రవారం ప్రత్యేకాధికారి సుదర్శన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట ఎంపీడీవో సురేశ్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ముక్కోటి దర్శనానికి ముస్తాబు

- కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు
- నేడు ఉత్తరద్వార దర్శనం
- భక్తులతో కిటకిటలాడనున్న ఆలయాలు

భైంసాటౌన్: పట్టణంలోని పద్మావతి కాలనీలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ధనుర్మాస ఉత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 17నుంచి ఉత్సవాలు ప్రారంభం కాగా.. శనివారం వైకుంఠ(ముక్కోటి) ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారి ఉత్తరద్వార దర్శనానికి భక్తులు తరలిరానున్నారు. ఈమేరకు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజామున 4:05 గంటలకు స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించనున్నారు. ఐదు గంటల నుంచే భక్తులను ఉత్తరద్వార దర్శనానికి అనుమతించనున్నారు. జనవరి 14న గోదారంగనాథుల కల్యాణోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

షెడ్యూల్ ఇలా..

- డిసెంబర్ 23న శనివారం తెల్లవారుజామున 4:05 గంటలకు స్వామివారికి క్షీరాభిషేకం, ఐదు గంటల నుంచి వైకుంఠ (ఉత్తర) ద్వార దర్శనం ఉంటుంది.
- 30న శనివారం ఉదయం 11 గంటలకు ఉత్సవ మూర్తుల తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు సహస్ర దీపాలంకరణ చేపట్టనున్నారు.
- 31న ఆదివారం నుంచి జనవరి 2 వరకు రోజు ఉదయం 5:30 గంటలకు నమ్మాళ్వార్ తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు పరమపద ఉత్సవాలు ఉంటాయి.
- జనవరి 12న శుక్రవారం ఉదయం 6:05 గంటలకు కూడారై మహోత్సవం
- 14న ఆదివారం శ్రీ గోదారంగనాథ స్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.



భైంసాలోని శ్రీ వేంకటేశ్వరాలయం

ఏర్పాట్లు చేస్తున్నాం..

ధనుర్మాస ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశాం. ఈనెల23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారి ఉత్తరద్వార దర్శనం కోసం ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. – నారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షుడు, భైంసా

కుంటాల: మండల కేంద్రంలోని శ్రీకృష్ణ ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. అర్చకులు శ్రీకాంత్ శుక్రవారం ఆలయంలో విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. శనివారం భక్తులు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకుంటారు.



కుంటాల: పారాయణంలో అర్చకుడు శ్రీకాంత్

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర ఆలయం వేడుకలకు సిద్ధమైంది. శనివారం తెల్లవారుజామున ఐదు గంటల నుంచి ఉత్తర ద్వార దర్శనం కోసం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. పండితులు చక్రపాణి వాసుదేవాచార్యులు, నర్సింహమూర్తి, సందీప్‌శర్మ ఆధ్వర్యంలో లక్ష్మీతులసీదళ అర్చన, సామూహిక విష్ణుసహస్ర పారాయణం, భగద్గీత పారాయణం నిర్వహించనున్నారు.

నామమాత్రంగా ముగించేశారు..

- నర్సాపూర్(జి) సర్వసభ్య సమావేశానికి పలువురు అధికారుల గైర్హాజరు
- పెండింగ్ బిల్లుల కోసం సభ్యుల వినతి

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని గంట లోపే ముగించేశారు. ఎంపీపీ కొంద్ర రేఖ అధ్యక్షతన జరిగిన సమావేశానికి భగీరథ (గ్రిడ్), భగీరథ(ఇంట్రా), ఆర్టీసీ, మత్స్యశాఖ, అటవీశాఖ అధికారులు గైర్హాజరయ్యారు. ఆరుగురు ఎంపీటీసీలకు గాను ముగ్గురు హాజరయ్యారు.

- విద్యార్థుల కనీస సామర్థ్యాలను పెంచేందుకు ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు 'ఉన్నతి' అమలు చేస్తున్నట్లు ఎంఈవో కస్తూరి శంకర్ పేర్కొన్నారు. 'లక్ష్య'లో భాగంగా పదో తరగతి విద్యార్థులకు రోజు ఉదయం గంట ప్రత్యేక తరగతులు చేపడుతున్నట్లు తెలిపారు.
- వైద్యాధికారి శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో గత మూడు నెలల్లో 22 సాధారణ, 105 సిజేరియన్ డెలివరీలు చేసినట్లు పేర్కొన్నారు. కరోనా కొత్త వేరియంట్ జేఎన్-1 వైరస్ కేసులు నమోదవుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.
- ఏవో సాయికిరణ్ మాట్లాడుతూ 63 మంది కొత్తగా రైతుబంధుకు దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. పీఏసీఎస్, డీసీఎంఎస్ సెంటర్లలో యూ రియా అందుబాటులో ఉందన్నారు.
- ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి మాట్లాడుతూ మండలంలో ఐదు అంగన్‌వాడీ టీచర్ పోస్టులు, నాలుగు హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటి భర్తీకి ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు.
- నీటిపారుదలశాఖ ఏఈ సాన్ కాంబ్లే గంగాధర్ మాట్లాడుతూ వర్షాలకు గొల్లమాడ పెద్ద చెరువు అలుగు దెబ్బతిందని.. వాటి మరమ్మతులకు రూ.లక్ష అంచనా వేశామన్నారు. మూడుసార్లు టెండర్లు పిలిచినా ఎవరూ రావడం లేదన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రేఖ

పెండింగ్ బిల్లులు విడుదల చేయండి..

గొల్లమాడ సర్పంచ్ మాట్లాడుతూ బృహత్ ప్రకృతివనం, మనఊరు-మనబడి, జీపీ పనుల రూ.30 లక్షల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని కోరారు. నర్సాపూర్(జి) ఎంపీటీసీ మల్లేష్ మాట్లాడుతూ సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు సంబంధించి రూ.5 లక్షల బిల్లులు రావాల్సి ఉందని పేర్కొన్నారు. ఏఈ శివప్రసాద్, జెడ్పీటీసీ చిన్న రామయ్య, వైస్‌ఎంపీపీ లక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్, కోఆప్షన్ సభ్యులు ఫసి, సర్పంచ్‌లు మహేశ్, అశ్విని, నస్రీన్‌బేగం పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన

లోకేశ్వరం: ఉపరాష్ట్రపతి ప్రతిష్ఠ దెబ్బతీసేలా వ్యవహరించిన టీఎంసీ, కాంగ్రెస్ ఎంపీలపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. బీజేపీ నాయకులు నల్ల రమేశ్, చిన్నారావు, శ్రీధర్, రాజశేఖర్, జయసాగర్‌రావు, జీవన్, వెంకట్‌రెడ్డి, గోపి, ముక్తేష్, విలాస్, లక్ష్మణ్‌రావు, సాయికుమార్, సాయన్న, సాయికిరణ్, గణేశ్ ఉన్నారు.

కడెంలో..

కడెం: టీఎంసీ, కాంగ్రెస్ ఎంపీలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మందపల్లి రమేశ్, రవిగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట బీజేపీ నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఇందులో తిరుమలయ్య, మోహన్, ప్రవీణ్, రమణ, రాజేందర్, అంబాజీ తదితరులున్నారు.